# రవ్వల నెక్లెస్

**ప్రభాకరుని** ప్రభాత కిరణాలు శరీరాన్ని నులివెచ్చగా తాకడంతో మెలకువ వచ్చింది. అనుపమరావుకి. బద్ధకంగా లేచి క్యాలండర్ వంకచూశాడు.

ఫస్టు తారీఖు

గుండె ఝల్లుమంది.

ఒళ్ళు చమటలు పట్టింది.

ఉద్యోగస్తులందరికీ ఆవేళ పర్వదినమైతే అనుపమరావుకి మాత్రం పస్తుల దినం. పాపం అతడిలా జీతం అందుకుంటాడో లేదో అప్పులవాళ్ళు అలా ఎగరేసుకుపోతారు. ఇహ మొండి చేతులతో మిగిలిన తనని బాకీలవాళ్ళు విడిచిపెడతారా?... ఉహు...రాంబదుల్లా పీక్కు తినడం ప్రారంభిస్తారు. అందుకే అతడి అంత రంగంలో అంత అలజడి. నిత్యం చచ్చేవాడికి ఏడ్చే వారుండరన్నట్లు నెలనెలా ఎదురయ్యే ఈ దుస్థితికి మథనపడటం అవివేకమనిపించింది. మొండి ధైర్యం తెచ్చుకుని మంచం దిగాడు.

కాలకృత్యాలు ముగించుకుని వచ్చిన భర్తకు కాఫీ ఇచ్చింది. అరవింద.

కాఫీ సిప్‌చేస్తూ భార్య ముఖంలోకి చూశాడు. కళావిహీనంగా ఉన్నాయి ఆమె కళ్ళు.

"ఏం అలా వున్నావ్" అని అడగాలనుకున్నాడు. అయితే ఆ మాట నోట్లోంచి ఊడి బయటపడటం లేదు.

"ఇవాళ జీతాలనుకుంటాను" అందామె ఖాళీ కప్పు అందుకుంటూ.

"ఈ నెలలోనైనా పాలవాడి డబ్బు వాడి ముఖాన కొట్టండి. బాకీ తీర్చకపోవడం వల్ల పాలకు బదులు వాడు నీళ్ళు పోసేస్తున్నా మాట్లాడలేకపోతున్నాను".

భార్య విధించిన మొదటి షరతుకు ఊఁకొట్టాడు అనుపమరావు. ఆమె పెట్టిన ప్రతిప్రపోజలుకు గంగిరెద్దులా తల ఊపడం తప్ప ఏనాడైనా ఆచరణలో పెట్టిన పాపాన పోతేనా?

"జీతం కట్టలేదనని స్కూల్లో పేరుతీసేశారు నాన్నా" ఫిర్యాదు చేసింది కన్వెంట్లో చదువుతున్న కల్యాణి.

"మీకు గుర్తుందో లేదో రేపు చంటాడి పుట్టినరోజు. ఆఫీసునుండి వచ్చేటప్పుడు క్రొత్త డ్రస్సు పట్టుకురండి" మరో ప్రతిపాదన చేసింది అరవింద.

"ఈ ఫస్టుకైనా అద్దె పూర్తిగా జమకట్టకపోతే ఇల్లు ఖాళీ చేయవలసి ఉంటుంది" ఇంటి యాజమాని చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది.

వెంటనే నా మాట ఏమిటన్నట్టు మనియార్డరు కోసం ఎదురు చూసే తండ్రి దీనవదనం మదిలో మెదిలేసరికి తల దిమ్మెక్కి పోయింది.

అనుపమరావు రెవిన్యూ డిపార్టుమెంట్లో జూనియర్ అసిస్టెంటు. భార్యాబిడ్డల బాధ్యతతోపాటు అవసానదశకు చేరుకున్న కన్నవాళ్ళ మంచిచెడులు కూడా తనే చూడవలసి రావడంతో జీతం చాలక అప్పులు చేయడం, తీర్చలేక తిప్పలు పడటం అతడికలవాటై పోయింది.

పెనిమిటిని ఆఫీసుకి, పిల్లల్ని స్కూళ్ళకి సాగనంపి లోపల కొచ్చింది అరవింద.

కడలిలో రేగిన తుఫానులా కల్లోలంగా ఉందామె మనసు. అందిన చోటల్లా అప్పులు చేయడం తప్ప బాకీల సంగతి పట్టించుకోడు భర్త. డబ్బు పూర్తిగా జమకడితే తప్ప సరుకులిచ్చేది లేదంటాడు కిరాణాకొట్టు వాడు. ఇంతకీ అనుపమరావుకి అప్పులు చేయవలసిన అవసరమేమిటో ఆమె కర్థంకావడం లేదు. తనేమైనా దుబారా చేస్తోందా? లేదే. మరి జీతం చాలకపోవడమేమిటి? అప్పులు చేస్తూ అతగాడు వెలగబెట్టే ఘనకార్యమేమిటో? ఈ మధ్య అతడి ప్రవర్తన ఆమె అనుమానానికి ఆజ్యం పోస్తోంది. ఆఫీసు అయిదింటికైపోయినా రాత్రి తొమ్మిది దాటితే తప్ప ఇల్లు చేరడం లేదు. అనుపమరావు. ఆలస్యంగా ఇంటికి రావడం, అదేపనిగా అప్పులు చేయడం చూస్తూ ఉంటే భర్త చెడు వ్యసనాలకి బానసైపోతున్నాడేమోనని భయపడిపోయింది. అయితే ఒక విషయంలో మాత్రం అతడిని మెచ్చుకోవాలి. ఈతి బాధలెన్నె ఉన్నా తనని మాత్రం అపురూపంగా చూసుకుంటాడు. అందుకే గట్టిగా ఏమీ అనలేకపోతోంది. తన పన్నెండేండ్ల వైవాహిక జీవితంలో అనుపమరావు కటువుగా మాట్లాడి సందర్భం మచ్చుకైనా కనిపించదు. తనకిప్పుడు ఈ మాత్రమైనా మనశ్శాంతి లభిస్తోందంటే భర్తలో ఆ ఒక్క సుగుణమే అందుక్కారణం.

★ ★ ★

"పి.ఎఫ్. అడ్వాన్సు, ఫెస్టివల్ అడ్వాన్సు, జనరల్ కటింగ్స్ పోగా నీ జీతం పన్నెండు వందలు. తీస్కో" అన్నాడు సేలరీ డిస్బర్సు చేస్తున్న రంగారావు.

ఎక్విటెన్సు మీద సంతకం చేసి డబ్బు అందుకున్నాడు అనుపమరావు.

"గత నెలలో తీసుకున్న చేబదులు ఇలా పారేయ్" అతడి చేతిలోంచి రెండు వంద కాగితాలు ఎగరేసుకుపోయాడు ఏడుకొండలు.

జుట్టు పీక్కుంటూ ఆఫీసు మెట్లు దిగాడు అనుపమరావు.

మరో ఐదొందలు గేటు దగ్గర నిలబడి ఉన్న కాబూలివాడి జేబులోకెళ్ళిపోయాయి.

"పాపం అనుపమరావు జీతమంతా ఆఫీసులోనే హరించుకు పోయింది. ఇక ఇంటిని, ఇల్లాల్ని ఎలా నెగ్గుకొస్తాడో?!" బోలెడంత సానుభూతి కురిపించాడు సూపరింటెండెంటు సత్యారావు.

"అతడి మీద మీరంత జాలి చూపనవసరం లేదు. ఈ నెలలో నా దగ్గర అప్పు తీసుకుంటే మరుసటి నెలలో మరొకరి నెత్తిమీద చెయ్యివేస్తాడు. అడిగిన వ్యక్తిని అడగకుండా కాలం నెట్టుకొస్తున్నాడు. అదే అతగాడి టాలెంటు. మన ఆఫీసులో ఇరవై మంది స్టాఫ్ ఉన్నారు. అందు వల్ల రెండేళ్ళ వరకు అతగాడికి అప్పుకేమీ ఢోకాలేదు. కేవలం ఇచ్చిపుచ్చుకోవడాలే" అన్నాడు ఏడుకొండలు.

"అతడి పాలసీ చిత్రంగా ఉంది. ఆఫీసులో అడ్వాన్సు ఇస్తామంటే చాలు మొదటి ధరఖాస్తు అతడిదే. దొరికిన దగ్గరల్లా అప్పులు చేయడం తప్ప ఇంటి బాకీ లేవీ తీర్చడని వాళ్ళ ఆవిడ మా శ్రీమతితో ఒకటే గోల. మరి ఈ డబ్బంతా పట్టుకెళ్ళి ఏం చేస్తున్నట్లో?" అనుమానం వ్యక్తం చేశాడు సత్యారావు.

"మందుకి, మగువకి అలవాడు పడ్డవాడికి ఎంత ఉంటే మాత్రం ఏం సరిపోతుంది?"

అతడి అనుమానాన్ని నివృత్తి చేశాడు ఏడుకొండలు.

"నువ్వెన్ని చెప్పు అనుపమరావుకి అటువంటి అలవాట్లు ఉన్నాయంటే నేను చచ్చినా నమ్మను"

"మీ అమాయకత్వం గాని తాగినవాడు మన వద్దకొచ్చి మూతి వాసన చూపిస్తాడటండీ. మీ మాటలు మరీ చోద్యంగా ఉన్నాయి"

"పోన్లేవోయ్. అతడి గురించి ఆలోచిస్తూ మనం బుర్రలు పాడుచేసుకోవడం దేనికి?" అంటూ ఫైలులోకి తలదూర్చాడు సత్యారావు.

"ఓయ్ గురునాథం నాకీ నెలలో రెండొందలు సర్దాలోయ్. మళ్ళీ ఫస్టుకి నీ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను"

అనుపమరావు అభ్యర్థనకి సారీ అన్నాడు గురునాథం.

"నా మీద సందేహం అక్కర్లేదు. శ్రీరాముడి బాణమైనా తప్పుతుందేమో గాని నా మాట మాత్రం వీసం పొల్లుపోదు" అన్నాడు అనుపమరావు.

"నీ మాట మీద నమ్మకం లేక కాదు, నాకీ నెలలో అనుకోని ఖర్చులు తగిలాయి. నేనే నిన్ను రెండొందలు అడగాలనుకుంటున్నాను" ఎదురు బాణం సంధించాడు గురునాథం.

"ఎగతాళి చేయడానికి నేనే దొరికానా చెప్పు. నా జీతమంతా అప్పులవాళ్ళు ఎగరేసుకు పోవడం చూస్తూనే ఉన్నావుకదా. ఈ ఐదొందలతో ఎలా సంసారం చెయ్యమంటావ్? చచ్చి నీ కడుపున పుడతాను. ఓ రెండొందలు ఎడ్జిస్టు చేయి... ప్లీజ్... నీకీ నెలలో ఇంక్రిమెంటల్ ఎరియర్సు కూడా వచ్చాయి కదా! నీ కొలీగ్ పస్తుంటే నువ్వు పాయసం తాగడం భావ్యమేనా చెప్పు బ్రతిమలాడాడు అనుపమరావు.

అతడి మాటల గారడీకీ కరిగిపోయి జేబులో చెయ్యిపెట్టాడు గురునాథం.

డబ్బు తీసుకొని బజారుకెళ్ళి కావలసిన వేవో కొనుక్కుని ఇంటికొచ్చాడు అనుపమరావు.

ఇల్లాలు వండి వడ్డించిన వంటకాల్ని సుష్టుగా తిని కిళ్ళీ బిగించాడు.

రాత్రి తొమ్మిదిన్నరైంది.

పిల్లలు నిద్రలోకి జారుకున్నారు.

వంటగది ఊడ్చి సామాన్లు సర్దుకుని బెడ్ రూములోకి అడుగుపెట్టింది అరవింద. ఆమె ముఖం మీద పేరుకున్న స్వేదబిందు వులు విద్యుత్ బల్బుకాంతిలో ముత్యాల్లా మెరుస్తున్నాయి. చెదిరిన ముంగురులు ముఖం మీద పడుతూ ఉంటే చేత్తో పైకెగదోసు కుంటోంది. శరీరానికి అతుక్కుపోయి బిగుతుగా ఉన్న నల్లని జాకెట్టు తెల్లని వాయల్ చీరలో అజంతా శిల్పంలా ఉంది.

ఆమె సౌందర్యాన్ని చూసిన అనుపమరావు కళ్ళు చెదిరిపోయాయి.

"అరవిందా!" అంటూ ఆప్యాయంగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. మురిపెంగా జడలో మల్లెలు తురిమాడు.

"నాకు ఇది కావాలని, అది కావాలని మిమ్మల్ని ఏనాడు వేధించలేదు. అయినా మీరెందుకిన్ని అప్పులు చేయవలసి వస్తోందో నాకు అర్థం కావడం లేదు. బాకీల వాళ్ళు మిమ్మల్ని మాటలతో బాధిస్తూ ఉంటే నేను భరించలేకుండా ఉన్నాను" బాధగా అన్నది అరవింద అతడి పట్టునుండి విడిపించుకుంటూ.

"పిచ్చిదానా, అప్పులు చేసిన వాడి వెనుక చెప్పులు తొడుక్కున్న వాడి వెనకా వెళ్లకూడదన్నారు మన పూర్వీకులు. ఆ సంగతి నాకు తెలియదా? అయినా అప్పులు చేస్తూ అందరికీ దూరంగా ఉంటున్నానంటే అందుకు ఏదో ఒక ప్రబలమైన కారణం ఉంటుందని గ్రహించు. ఈ రోజుల్లో చెప్పులు తొడుక్కోనివాడుంటే ఉండవచ్చునేమోగాని, అప్పులేని వాడు మాత్రం మచ్చుకైనా కనిపించడు."

"మీరేదేదో చెప్తుంటారు. నాకేమీ అర్థం కాదు" అంది అరవింద అదోలా ముఖం పెట్టి.

"ఇందులో తెలియకపోవడానికేముంది? నేను అప్పులు చేస్తోంది ఆదా చేయడానికేగాని జల్సా చేయడం కోసం కాదు. నువ్వు ఆ విషయం తెల్సుకుంటే నాకంతే చాలు. ఎవరేమనుకున్నా పరవాలేదు. పొదుపు చేస్తూ ఆదా చేయాలనుకున్నంత కాలం పైసా కూడా కూడబెట్ట లేకపోయాను. అప్పులుంటే ఖర్చులు అదుపులో ఉంటాయి. పైగా మనల్ని ఎవరు అప్పు అడగరు. అప్పులు చేస్తూ పొదుపు చేసిన సొమ్ముతో నీకు ఏం చేయించానో చూడు" అంటూ చిన్న పెట్టెలోంచి నెక్లెస్ తీసాడు అనుపమరావు.

భర్త చేతిలోని రవ్వల నెక్లెస్ చూసేసరికి అరవింద కళ్ళు జిగేల్‌మన్నాయి. కలా? నిజమా? అనుకుందొక క్షణం.

"రేపు మన 'మ్యారేజ్‌డే'కి నీకు గిఫ్ట్‌గా ఇద్దామనుకున్నాను. కాని అడ్వాన్సుగానే కొట్టేశావు" అన్నాడు అనుపమరావు నవ్వుతూ.

'అబ్బ నెక్లెస్ ఎంత బావుందండి' అంది అరవింద నగ మెడకు తగిలించుకొంటూ.

"పోతే, రాత్రిళ్ళు నేను ఆలశ్యంగా రావడానికి కూడా కారణం ఉంది. రోజూ నేనొక హోల్‌సేల్ మందుల దుకాణంలో అకౌంట్సు రాస్తున్నాను. చేసే అప్పులు తీర్చడానికే నేనందులో చేరాను. ఆ విషయం బయటకు చెప్పుకోకూడదు కదా! ఇవాల్టినుండి నా డ్యూటీ ప్రొప్రైటరు గారి అబ్బాయి తీసుకున్నాడులే. మరి ఆ షాపుకి వెళ్ళనవసరం లేదు. రేపటినుండి సాయంత్రం అయిదు గంటలకే నీ ముందొచ్చి వాలతాను. సరేనా?" అన్నాడు భార్యను దగ్గరకు తీసుకుంటూ.

మగడి మాటలకు మత్తుగా నవ్వింది అరవింద. ఆ నవ్వు కాంతికంటే వెయ్యిరెట్లు అందంగా ఉన్నట్లనిపించిందతడికి.

"క్షమించండి. అందరి లాగే నేనూ మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. ఆర్థిక ఇబ్బందులవల్ల అప్పులు చేసేవారు కొందరైతే, విలాసాలకు డబ్బుచాలక అప్పులు చేసేవారు మరికొందరు. వాళ్ళందరికంటే భిన్నంగా మీరు పొదుపు చేసేందుకు అప్పులు చేస్తున్నారన్నమాట" అంటూ అతడి వొడిలో గువ్వపిట్టలా వొదిగిపోయింది అరవింద.

**(23-10-1997 మహిళ ఆంధ్రప్రభ డైలి)**